క్లుప్తంగా

పరిసరాల శుభ్రత పాటించాలి



కొలగానహళ్లిలో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించాలని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారులు గీతాభార్గవి, కుమారరాజ సూచించారు. శనివారం మండలంలోని కొలగానహళ్లి గ్రామంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా సీజనల్ వాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు బాలాజీ, వెంకటరమణ, నాగరత్నమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు నేడు పరామర్శ

కంబదూరు: కంబదూరు, జెక్కిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వడ్డే చిన్న ఈరన్న, బడిగి శంకరప్ప గుండె పోటుతో ఇటీవల మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాలేదని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాలేదన్న బాధతో గుండెపోటుతో మృతి చెందారు. బాధిత కుటుంబాలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య ఆదివారం పరామర్శించి, భరోసా కల్పించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ బాలరాజు యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యులు రమేష్

గుమ్మఘట్ట: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కాపాడుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు రమేష్ తెలిపారు. మండలంలోని జ్యోతి రాబాపూలే గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు ఆహారపు అలవాట్లు, ఆహార సూత్రాలు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, వైద్యులు సందేశ్‌కుమార్, సీహెచ్‌ఓ మురళీధర్, సూపర్‌వైజర్ ఆది బయమ్మ, ఏఎన్‌ఎం సువర్ణమ్మ, ఉపాధ్యాయినులు హిమబిందు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సీతారాములకు పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో సీతారాములు

కూడేరు: మండల కేంద్రం కూడేరులోని కోదండరామాలయంలో శనివారం సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు భాస్కర్ శర్మ తొలుత సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయ స్వామికి పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన చేశారు. అనంతరం వివిధ రకాల పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు.

2,600 క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ

కూడేరు: మండల పరిధిలోని 12 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 2,600 క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ చేసినట్లు ఏఓ విజయ కుమార్ శనివారం తెలిపారు. మండలానికి 2,600 క్వింటాళ్ల విత్తన వేరుశనగను అధికారులు కేటాయించారన్నారు. 2882 మంది రైతులు విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోగా, అందరికీ అందించినట్లు తెలిపారు. ఇంకా మండలానికి 500 క్వింటాళ్ల విత్తన వేరుశన కావాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ శైలజ, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

నేమకల్లు అంజన్నకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో నేమకల్లు అంజన్న

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లులో ప్రసిద్ధి చెందిన ఆంజనేయ స్వామి ఆలయంలో అంజన్నకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణల మధ్య అంజన్నకు పూజలు చేశారు. ఉదయం ఆరు గంటలకు స్వామి బావి నుంచి పవిత్ర జలం తీసుకొచ్చి ప్రత్యేకంగా అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, ప్రత్యేక అలంకరణ చేశారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

• రేపు ఈదుల్ అజ్హా ప్రత్యేక నమాజ్

రాయదుర్గంటౌన్: ముస్లింల పర్వదినమైన బక్రీద్ (ఈదుల్ అజ్హా) త్యాగానికి ప్రతీకగా జరుపుకుంటారు. ముస్లింలకు ఏడాదిలో రెండు ప్రధాన పండుగలు. ఒకటి రంజాన్ కాగా మరొకటి బక్రీద్. రాయదుర్గంలో ఈనెల 17న బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకోనున్నారు.

బక్రీద్ పర్వదిన ప్రాధాన్యత ...

దైవ ప్రవక్త హజరత్ ఇబ్రహీం (సా)కు అల్లాపెట్టిన అగ్ని పరీక్షల్లో భాగంగా ఏకైక కుమారుడు ఇస్మాయిల్ అలైహివస్సలాం ఎనిమిదేళ్ల వయసులో ఉన్న బాలుడిని దేవుడి పేరిట త్యాగం చేయాలని ఆజ్ఞ వస్తుంది. ఇందులో భాగంగా అల్లా కలలో ఆదేశించిన సూచనల మేర అడవిలో ఏకాంత ప్రదేశంలో రాతిపై ఇబ్రహీం (సా) కుమారుడు ఇస్మాయిల్‌ను సమర్పించేందుకు తీసుకెళతారు. వెంట పదునైన కత్తి కూడా తీసుకెళ్తారు. బాలుడు ఎక్కడకి తీసుకెళుతున్నారని చిలిపి మాటలతో తండ్రిని పలుమార్లు ప్రశిస్తున్నా సమాధానం ఇవ్వలేదు. చివరకు అల్లా ఆదేశించిన ప్రదేశానికి తీసుకెళ్తారు. అక్కడకు వెళ్లి రాతిపై పడుకోబెట్టిన తరువాత కుమారుడికి అనుమానం కలిగి తనను సమర్పించమని అల్లా ఏమైనా ఆదేశించాడా? అని ప్రశ్నిస్తాడు. దీనికి అవునని సమాధానం చెబుతారు. దీంతో ఆ బాలుడు నాన్నా.. నా మీద ఉన్న ప్రేమతో కత్తిని గొంతుపై కోయలేవు, నా మొహానికి బట్టకట్టి నాపై కత్తి కోయాలని చెప్పాడు. బాలుడు చెప్పిన మేరకు గొంతుపై అతని తండ్రి వెంట తెచ్చుకున్న కత్తితో బలంగా కోసినప్పటికీ తెగలేదు. దీంతో బాలుడి తండ్రి కోపంతో రాతి గుండుపైకి కత్తిని విసరగా, ఆ పదునుకు రాయి రెండు ముక్కలవుతుంది. దీంతో అల్లా దేవదూత అయిన జిబ్రయిల్ (సా) అక్కడికి వచ్చి మీరు అల్లా పెట్టిన అగ్ని పరీక్షల్లో నెగ్గావు.. నీ కుమారుడి బదులు స్వర్గం నుంచి అల్లా స్వయంగా పెంచిన బలమైన పొట్టేలును వెంట తెచ్చాను. దీన్ని జువా చేయాలని ఆదేశిస్తారు. దీంతో అప్పటి ప్రవక్త ఇబ్రహీం(సా) పొట్టేళ్లను జువా చేశారు. నాటి నుంచి నేటి వరకు అలాగే ప్రళయ దినం రోజు దాకా బక్రీద్ పండుగ రోజున ఆర్థిక స్థోమత గలిగిన ప్రతి ఒక్కరూ పొట్టేళ్లను జువా చేసి తండ్రి, కుమారుల త్యాగాన్ని స్మరించుకోవాలని హదీస్, ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ చెప్తోంది.

ఈద్గా మైదానం	నమాజ్ వేళలు (సోమవారం)
బళ్లారి రోడ్డు	ఉదయం 8 గంటలకు
కణేకల్లు రోడ్డు	ఉదయం 7 గం.లకు
బీటీపీ రోడ్డు (బైపాస్)	ఉదయం 7.15 గం.లకు
దర్గా మసీద్	ఉదయం 7.30 గం.లకు



బళ్లారి రోడ్డులోని ఈద్గా మైదానం

నిర్ణీత వేళకు ఈద్ నమాజ్‌కు హాజరుకావాలి

రాయదుర్గంలో సోమవారం ఈదుల్ అజ్హా(బక్రీద్) పండుగ జరుపుకోనున్నట్లు ప్రభుత్వ ఖాజీలు కె.మహమ్మద్ సైపుల్లా, అతావుర్ రహిమాన్ తెలిపారు. నిర్ణిత వేళకన్నా అరగంట ముందుగానే ముస్లింలు ఈద్గాలకు చేరుకొని నమాజ్ ఆచరించాలని సూచించారు. కచ్చితంగా నిర్ణీత వేళకు నమాజ్ ప్రారంభం అవుతుందనే విషయాన్ని గుర్తించి వేళకు చేరుకోవాలని వేర్వేరు ప్రకటనల్లో కోరారు. అలాగే పట్టణంలోని సున్ని దర్గా మస్జిద్‌లో సోమవారం ఉదయం 7.30 గంటలకు ఈద్ నమాజ్ జరుగుతుందని అహ్లే సున్నత్ వల్‌జమాత్ సభ్యులు ఓ ప్రకనటలో తెలిపారు.

పంట మార్పిడితో మేలైన దిగుబడులు

• డీఆర్‌సీ డీడీఏ మద్దిలేటి

కణేకల్లు: ఏటా ఒకే రకమైన పంట సాగు చేయకుండా, పంట మార్పిడి చేసుకోవాలని డీఆర్‌సీ డీడీఏ మద్దిలేటి తెలిపారు. శనివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ హాలులో ఖరీఫ్ సాగుకు సమాయత్తం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీడీఏ మాట్లాడారు. రైతులు తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. భూసార పరీక్షల్లో వచ్చే సూక్ష్మ పోషకాల ఫలితాలను బట్టి భూమికి అనుకూలమైన పంటలు సాగు చేసుకొని, తద్వారా మేలైన దిగుబడులు పొందాలన్నారు. వాతావరణం అనుకూలించి వర్షాలు సమృద్ధిగా కురిస్తే జూలై 15 వరకు వేరుశనగ సాగు చేసుకోవచ్చని ఆయన సూచించారు. అరకొర పదునైతే కొర్ర, ఉలవలు, పెసర, అలసందులు, కందులు తదితర పంటలు సాగు చేసుకోవాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకంతో పెట్టుబడులు పెరిగి, లాభాలు తగ్గుతాయన్నారు. సేంద్రియ ఎరువుల వాడకాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. వరి, వేరుశనగ పంట సాగులో యాజమాన్య పద్ధతులను ఆయన వివరించారు. కంది, ఆముదం, మిరప తదితర పంటలకు ఆశించే చీడపీడలు, తెగుళ్లను ఏలా నివారించుకోవాలనే అంశంపై ఏడీఏ శైలజ, రైతు శిక్షణ కేంద్రం ఏఓ శ్రీనివాసులు రైతులకు వివరించారు. పంట సాగు సమయంలో తప్పని సరిగా విత్తనశుద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మల్లికార్జున, ఏఓ ఎ.శ్రవణ్, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీడీఏ మద్దిలేటి

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కణేకల్లు: పత్తి సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ లక్ష్మానాయక్ తెలిపారు. మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటలను రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్, కణేకల్లు ఏఓ శ్రవణ్‌కుమార్ శనివారం పరిశీలించారు. బ్రహ్మసముద్రం, 43 ఉడేగోళం, కె.మారెంపల్లి గ్రామాల్లో పత్తిపంటను అధికారులు పరిశీలించారు. పొలాల్లో అధిక నీరు నిల్వ వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరించారు. జనవరి చివరి వారం, ఫిబ్రవరి మొదటి వారంలో పత్తిసాగు చేశామని, ఇప్పటి వరకు రెండు కోతలు నిర్వహించినట్లు రైతులు అధికారుల దృష్టికి తెచ్చారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికి పువ్వులు, కాయలు రాలిపోయినట్లు అధికారులు గుర్తించారు. అనంతరం పొటాషియం నైట్రేట్ లేదా 19:19:19 ఎరువు 10 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పంటకు పిచికారీ చేయాలన్నారు. మొక్కలు ఎర్రబారి ఉంటే మెగ్నిషియం సల్ఫేట్ 5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు, వీఏఏస్‌లు పాల్గొన్నారు.



బ్రహ్మసముద్రం వద్ద పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ శ్రవణ్

మిలాథియన్‌తో దోమలకు చెక్

• మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్

కూడేరు: మిలాథియన్ మందు స్ప్రే చేస్తే దోమలు వృద్ధి చెందకుండా అరికట్టొచ్చని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మద్దయ్య అన్నారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో ఈ నెల 19 నుంచి ఎన్‌సీసీ శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. శిక్షణకు సుమారు 400 మంది పిల్లలు రానున్నారు. పిల్లలు రోగాల బారినపడకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా శనివారం వైద్యాధికారులు ఎన్‌సీసీ నగర్‌ను సందర్శించి, అన్ని గదుల్లో, ఆవరణలో దోమలు ప్రబల కుండా మిలాథియన్ మందు స్ప్రే చేశారు. సబ్ యూనిట్ ఆఫీసర్ మాట్లాడుతూ మలేరియా, డెంగీ తదితర విష జ్వరాలు దోమ కాటు ద్వారానే వ్యాపిస్తాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నూర్ బాషా, శ్రీధర్ మూర్తి, రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఏఎన్‌ఎం బాను, హెల్త్ అసిస్టెంట్ శివప్రసాద్, ఆశావర్కర్ పెద్దక్క తదితరులు పాల్గొన్నారు.



కూడేరు ఎన్‌సీసీ నగర్‌లో మిలాథియన్‌ను స్ప్రే చేయిస్తున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మద్దయ్య

పత్తి పంటను పరిశీలించిన ఏఓ

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్, దేవగిరి, రంగాపురం క్యాంపు తదితర గ్రామాల్లో సాగు చేసిన పత్తి పంటను వ్యవసాయాధికారి సాయికుమార్ శనివారం పరిశీలించారు. అధిక వర్షాలకు పత్తిసాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు వివరిస్తూ క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ 2024 ఖరీఫ్ సీజన్‌లో మండల వ్యాప్తంగా 650 ఎకరాల్లో పత్తి పంట సాగు అయినట్లు తెలిపారు. అధిక వర్షాలు కురుస్తుండటంతో నల్లరేగడి భూములో సాగు చేసిన పత్తి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పత్తిలో వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల వేరుకుళ్లు, కాండం కుళ్లు, కాయకుళ్లు వంటివి ఆశించే అవకాశం ఉంటుందన్నారు. రైతులు వాటి నివారణకు 19-19-19 ఎరువు 1.5 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారీ చేసుకోవాలాన్నారు. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటర్ నీటికి లేదా కార్బండజిమ్ ఒక గ్రాము ఒక లీటర్ నీటిలో కలిపి అడుగు భాగంలో పిచికారీ చేయాలన్నారు. పేనుబంక, పచ్చదోమ నివారణకు అసిఫేట్ 1.5 గ్రాముల లీటర్ నీటిలో కలుపుకొని పిచికారీ చేయాలన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ సాయికుమార్

శ్రీశ్రీతో 'అనంత' అనుబంధం

అనంతపురం కల్చరల్: తెలుగు కవిత్వాన్ని అంతర్జాతీయ బాట పట్టించిన శ్రీశ్రీకి జిల్లాతో అనుబంధం ఉండడం గర్వకారణమని పలువురు వక్తలన్నారు. శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా మహాకవి గుర్రం జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో శనివారం స్థానిక విశాలాంధ్ర బుక్ హౌస్ ప్రాంగణంలో పలువురు కవులు, రచయితలు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టజీవికి అటు ఇటు ఉండే వాడు నిజమైన కవి అని కవిత్వానికి కొత్త నిర్వచనం చెప్పిన మహాకవి శ్రీశ్రీ అన్నారు. తెలుగు సాహిత్యపు సువాసనలకు నోచుకోని ఎందరో అభాగ్యుల జీవితాలు శ్రీశ్రీ కవిత్వంలో పతాక శీర్షికన నిలిచాయన్నారు. విప్లవ రచయిత సంఘం ఆహ్వానం మేరకు అనంతకు రావడం, అనేక చర్చాగోష్టులలో పాల్గొనడం మన అదృష్టమన్నారు. 1971 నవంబర్‌లో స్థానిక లలితకళాపరిషత్‌కు, 1974లో కదిరి ప్రాంతానికి విచ్చేశారన్నారు. 1975 జనవరిలో ఏకంగా మూడు రోజులపాటు అనంతలో గడిపారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పతితులకు, భ్రష్టులకు, బాధాదర్పదష్టులకు అండగా నిలవడం వల్ల శ్రీశ్రీ చిరస్థాయిగా మిగిలిపోయాడని అభిప్రాయపడ్డారు. మహాప్రస్థానం, ఖడ్గసృష్టి, అనంతం వంటి కావ్యాలలో పెల్లుబికిన అపూర్వభావి విప్లవం, ఆయన రాసిన ప్రతి గేయం తెలుగువాడి గుండెల్లో ప్రతిధ్వనిస్తుందన్నారు. కార్యక్రమంలో సాహిత్యపీఠం నిర్వాహకులు నాగలింగయ్య, కవులు అశ్వర్థరెడ్డి, నాగేంద్ర, ఈరన్న, హరీష్, ప్రవీణ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా రచయితలు

ఎస్పీబీకి స్వర నీరాజనం

అనంతపురం కల్చరల్: గానగాంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యానికి గాయనీ గాయకులు స్వరనీరాజనమర్పించారు. ఎస్పీ బాలసుబ్రమణ్యం 78వ జయంతిని చంద్ర సినీ ఆర్కెస్ట్రా వారు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక లలితకళాపరిషత్తులో జరిగిన సంగీత విభావరిలో మొదట ఎల్కేపీ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, కార్యదర్శి పద్మజ, సీనియర్ నటుడు సోమిరెడ్డి, ఆచార్య సుధాకరబాబు, నిర్వాహకులు తలారి శ్రీనివాసులు, అస్లాంబాషా తదితరులు బాలసుబ్రమణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

వ్యక్తి అదృశ్యం

కూడేరు: మండలంలోని రామచంద్రాపురానికి చెందిన నాగరాజు బుధవారం సాయంత్రం నుంచి కనిపించలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల అతని ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో నాగరాజు భార్య శారద పోలీసు స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేసింది.

ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి



ఉరవకొండ కేజీబీవీలో దోమలమందు పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

ఉరవకొండ: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి, మేజర్ పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీల్లో విద్యార్థినులు మలేరియా, టైఫాయిడ్ తదితర విషజ్వరాల బారిన పడకుండా ముందు జాగ్రత్తగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. శనివారం ఉరవకొండ కేజీబీవీలో పారిశుధ్య సిబ్బందితో మురుగునీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేసులు పాల్గొన్నారు.

సద్గురువుల బాటలోనే సమున్నత జీవితం



శ్రీగంధ పూజలు నిర్వహించిన భక్తులు

అనంతపురం కల్చరల్: సద్గురువుల బాటలోనే సమున్నత జీవితం ప్రాప్తిస్తుందని దత్త పీఠాధిపతులు విద్యానృసింహభారతీ స్వామీజీ అన్నారు. శనివారం స్థానిక హెచ్చెల్సీకాలనీలోని శ్రీ అక్కల్ కోట మహారాజ్ సేవా సమాజ్ ఆశ్రమంలో వలీస్వామి ఆరాధన ఉత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన విద్యానృసింహభారతీ స్వామీజీ అనుగ్రహ భాషణం చేశారు. వలీస్వామితో భక్తులకు అనేక అనుభవాలున్నాయని, వారందరూ గొప్ప గురువును పొంది ధన్యులయ్యారన్నారు. సాక్షాత్తు అవధూత స్వరూపులుగా వలీస్వామి ఎన్నో లీలలను ప్రదర్శించి అనంతవాసులను భక్తిమార్గంలో నడిపించారని కొనియాడారు. అంతకు ముందు ఆశ్రమ నిర్వాహకులు విజయ్‌కుమార్ నేతృత్వంలో వలీస్వామి ఆశ్రమంలో పెద్ద ఎత్తున పూజలు, సామూహిక భజనలు, వివిధ దేవతా మూర్తులకు అభిషేకాలు జరిగాయి. వలీస్వామి సమాధి వద్ద శ్రీగంధ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధులు జయచంద్రారెడ్డి, చలపతిరెడ్డి, శ్రీధర్, కుముదమ్మ, ఏజీ ప్రమీళమ్మ, విజయ్‌కుమార్, సుబ్రమణ్యంపాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ మార్గదర్శకాలపై సమావేశం

ఉరవకొండ: నూతన ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పింఛన్ల పంపిణీ మార్గదర్శకాలపై ఎంపీడీఓ జీవీ సుబ్బరాజు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల పంపిణీకు సంబంధించి జీవో 43 విడుదల చేసిందన్నారు. జీవో ప్రకారం వైఎస్సార్ పింఛన్ కానుక బదులుగా ఎన్‌టీఆర్ భరోసా మార్చినట్లు తెలిపారు. ఇందులో మూడు కేటగిరీలుగా విభజించారన్నారు. మొదటి కేటగిరీ కింద 11 రకాల పింఛన్‌దారులు ఉంటారని, వీరికి ప్రస్తుతం ఉన్న రూ. 3వేల పింఛన్‌ను రూ. 4వేలుకు పెంచినట్లు తెలిపారు. కేటగిరి-2 కింద దివ్యాంగుల పింఛన్ రూ. 3 వేల నుంచి రూ.6 వేలకు పెంచారన్నారు. కేటగిరి-3 కింద దీర్ఘకాలిక రోగులు, మంచానికే పరిమితమైన వారికి అందించే రూ.5వేల పింఛన్‌ను రూ.15 వేలకు పెంచినట్లు తెలిపారు. సమావేశంలో పట్టణంలోని ఐదు సచివాలయాలకు వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సువార్త ఉజ్జీవ సభలను జయప్రదం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న పాస్టర్లు

రాయదుర్గంటౌన్: కళ్యాణదుర్గం పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఈ నెల 17,18,19 తేదీల్లో జరిగే సువార్త ఉజ్జీవ సభలను జయప్రదం చేయాలని పాస్టర్ల సంఘం అధ్యక్షుడు చల్లా కిశోర్ చౌదరి , జేసీఎం పాస్టర్ సల్మాన్ అంపన్న తెలిపారు. శనివారం పట్టణంలోని జేసీఎం చర్చిలో సభల పోస్టర్లను విడుదల చేశారు. రోజూ సాయంత్రం 6 గంటలకు ఉజ్జీవ సభలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జాన్‌పాల్, ఆనంద్, మల్లేష్, రాజేష్, రవి, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ శివ

బొమ్మనహాళ్: గ్రామాల్లో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసంచేసినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా చర్యలు తప్పవని ఎస్ఐ శివ పేర్కొన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఒకటి రెండు ఘటనలు మినహా శాంతియుతంగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం కూడా గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగించినా, అల్లర్లు చేసినా, దాడులకు పాల్పడినా చర్యలు ఉంటాయని, రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే ఎన్నికల ముందు నుంచి ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 545 మందిపై బైండోవర్ కేసులు, 44 మందిపై రౌడీషీట్‌లు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

బీటీపీకి కృష్ణా జలాలు తీసుకొస్తా : కాలవ



వినాయక సర్కిల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం: హంద్రీ-నీవా నుంచి జీడిపల్లికి చేరే కృష్ణా జలాలను భైరవానితిప్పా (బీటీపీ) ప్రాజెక్టుకు తీసుకొచ్చి, ఈప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత ఆయన తొలిసారిగా రాయదుర్గంలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ర్యాలీలో భాగంగా పట్టణంలోని వినాయకసర్కిల్‌లో కాలవ మాట్లాడారు. ఎన్నికల్లో అద్భుతమైన విజయం అందించారని, వారందరికీ రుణపడి ఉంటానన్నారు. పేదరిక నిర్మూలనకు శక్తి వంచన లేకుండా పాటుపడుతామన్నారు. సాగు నీటి రంగంతో పాటు గార్మెంట్స్ పరిశ్రమలను ఆదుకుంటామన్నారు.

పంటల సాగుపై అవగాహన సదస్సు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో ఖరీఫ్ -2024లో 'సాగుకు సమాయత్తం' కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా వనరుల కేంద్రం నుంచి డీడీఏ మద్దిలేటి, ఏడీఏ శైలజ, ఏడీఏ ఎల్లప్ప హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ, సాగు భూముల్లో నేలల ఆరోగ్యం క్షీణించి, సేంద్రియ కర్బనం అత్యల్ప స్థాయికి పడిపోయిందన్నారు. పశువుల పేడ వాడాలని, పచ్చి రొట్టె ఎరువు అయిన జనుము, జీలుగ, పిల్లిపెసర, మినుము, పెసర సాగు చేసి, భూమిలో కలియదున్నాలన్నారు. ప్రతి రైతూ సాగుకు ముందు, విత్తుకు ముందు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సరిత , వీఏఏలు , వీహెచ్ఏలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోండి

ఉరవకొండ: ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారిణి-2 రమాదేవికి ఏఐఎస్ఎఫ్ నాయకులు శనివారం వినతిపత్రం అందించారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు హరూన్ రషీద్ మాట్లాడుతూ ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యంపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో అనేకసార్లు ఫీజుల దోపిడీపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు.

22న 'సంధ్యారవళి'

అనంతపురం కల్చరల్: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఈనెల 22న 'సంధ్యారవళి' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి తెలిపారు. శనివారం కమలానగర్‌లోని శ్రీనృత్యకళానిలయంలో ఆమె మాట్లాడారు. సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడుతూ 12 గంటల పాటు నిర్విరామంగా శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకూ నృత్య ప్రదర్శనలివ్వడానికి వివిధ రాష్ట్రాల నుంచి 300 మంది కళాకారులు విచ్చేస్తున్నారని తెలిపారు.